# యక్షగానం



ఊరూరు తిర్గుకుంటూ, భాగోతులు ఆడుకుంటూ పోతుంద్రు రావులపెంట దాసరోల్లు. ఆవూరి దొరలు, పటేండ్లు దయ తలచి నాల్గు నాటకాలు ఆడిస్తే ఆడేది, లేకుంటే సాపలు అల్లుకుంటూ, అమ్ముకుంటూ, అడుక్కుంటూ జీవనం వెల్లదీస్తుంద్రు.

రాను రాను జనాలకు సినిమాల సోకు ఎక్కువయింది. నాటకాలు ఎవడూ చూడకుంట య్యింద్రు. పాత పరిచయాలున్న వూర్లకు పోయి 'నాటకం వేస్తం దొరా' అంటే–

'ఈ రోజుల్లో మీ నాటకాలు ఎవరు చూస్తడురా' అంటూ ముఖంమీద కొట్టినట్లె అంటుంద్రు. ఆఖరికి కిరీటాలు భుజకీర్తులు బుట్టల్లబెట్టి అటకెక్కించింద్రు. వాటిని తెరిచి చూడక చాన్నాల్లయ్యింది. ఆ కళాకారులందరు బతుకుదెరువుకు వూరికొకరయ్యి వ్యవసాయకూలీలుగా, బిచ్చగాల్లుగా మారి పోయింద్రు. చూస్తుండగానే ఆ కళ కనుమరుగయ్యింది.

నాగార్జునసాగర్ కాల్వ వదిలినంక, కూలిపనులు దొర్కుతున్నయని కాల్వ పక్కనున్న ముకుందాపురం చేరింద్రు. పెద్దకాల్వ తీసినప్పుడు, మట్టికని తీసుకున్న జాగలో బొందలు ఉంటే వాటిని పూడ్చి గుడిసెలేసుకుంద్రు. ఆ వూరు వీరికి అన్ని విధాలా అనుకూలంగా

ఉంది. సంవత్సరం పొడుగునా ఏదో ఒకపని దొర్కుద్ది. అన్నిటికంటే ముఖ్యంగా చుట్టపక్కల ఊర్లల్ల తాగినంత కల్లు దొర్కుద్ది.

లేవంగానే చిన్నపోరలు, ఆడోల్లు వూర్లెకెల్లిపోయి చద్దిబువ్వ అడుక్కొచ్చుకుంటరు. తర్వాత ఈతాకులతో సాపలు అల్లుకుంటూ ఆడవాల్లుంటరు. మొగోల్లు గాలాలు ఉతీసుకుని చెర్లపొంటె పోయి చేపలు పట్టుకొచ్చుకొని అమ్ముకుంటుంటరు.

దాసరి రామచంద్రం మేళ్లమంటే – భాగోతాలాడటంలో మాంచి పేరుండె కాని వాన్నిప్పుడు ఎవరు కానటం లేదు– ముసలోడయ్యిండు. వానికిద్దరు పెండ్లాలు. పదిమంది పిల్లలు. అందరి పెండ్లిల్లు, పేరంటాలు అయినయి. ఎవని గుడిసె వానిదే. నాటకాలు ఆడే రోజుల్లో పెద్దపెండ్లాం పిల్లలు వేషాలు కట్టేది. చిన్నపెండ్లాం పిల్లలకు అది· అబ్బలేదు.

రామచంద్రం తమ్ముడు ముత్తిలింగం. వయసున అన్నమేళం లోనే నాటకాలు అడెటోడు. చిన్నప్పటి నుండి కనుచూపు తక్కువే. రాను రాను కండ్లు పూర్తిగా కన్పించకుండ పోయినయి. భార్య చాన్నాలకిందనే కాలంచేసింది. కొడుకు నిడమనూరులో మిల్లుపనికి పోయి లారిమీద వస్తొస్త జారిపడి చనిపోయిండు. కోడలు మొగుడు చచ్చినంక ఇక్కడ నాకేం పనని, చిన్నపోరిని వదిలిపెట్టి మారుమనుము పోయింది.

ముత్తిలింగం బతుకు భారమైపోయింది. పొద్దుగాల మనుమరాలు వూల్లెకు పోయి చద్దిబువ్వ అడుక్కొస్తె దానితోనే ఎల్లదీసుకొనేది. ఆ చిన్నపిల్ల తాతను తీసుకొని బస్టాండు చెట్టుకింద కూర్చోబెడితె తాంబూర తీసుకొని తత్వాలు పాడుతుండేది. వచ్చిపోయెటోల్లు ముందర పరిచిన కండువలో పావలో, పరకో వేస్తుండేది. రోజు పొద్దుగూకంగ సారకొట్టు ముందు కూర్చొని అవో ఇవో తత్వాలు పాడుతుంటే, దయగల తండ్రులు ముసలోడని ఓ పావు సారా పోయిస్తుండేది.

మనుమరాలు దుర్గి పెద్దదయింది. పొద్దున్న ముసలోన్ని రోడ్డుమీది చెట్టుకింద కూర్చోబెట్టి తను కూలినాలికి పోతుండేది. రాను రాను కాల్వకింద ఒక్క పంటకే నీల్లివ్వబట్టింద్రు. పొలంపనులు లేనప్పుడు ఇటుక, ఇసుక తోలే ట్రాక్టరు మీద కూలిపనికి పోబట్టింది. ఏడాది తిరిగే వరకు ట్రాక్టరు డ్రైవరుతో దోస్తాన అయ్యి చెప్పాపెట్టకుండా లేచిపోయింది.

గుడ్డి ముత్తిలింగం గుండె పగిలిపోయింది. బస్సులు ఆగెకాడికి తోడులేంది పోలేకపోతుండు. చిన్నపిల్లగాల్లు పట్టుకపోయి చెట్టుకింద కూర్చోబెడితే 'వస్తా వట్టిదే – పోతా వట్టిదే, ఆశ ఎందుకంటా' అంటూ తంబూర మీటుకుంటూ పాడుతుండేది. గిన్నెలో పడ్డ చిల్లరడబ్బుతో సారాకొట్టుకు పోయి పావో, అరపావో మింగుతుండేది. దయతలచి చుట్టుపక్కల గుడిసెలోల్లు యాల్లకింత కూడేసేది. లేకుంటే లేదు.

ఒకనాడు తాగుడు ఎక్కువైంది. సారాదుకాణం ముందే సోయితప్పి పడిపోయిండు. మల్లి తెల్లారి లేవలేదు.

❀ ❀ ❀



కాల్వపక్కన పటేలు భూములున్నయి. ఊరు పెర్గిపోతుందని అందులోనే ఇల్లు కట్టుకుండు. కాల్వకు దగ్గరలో వేపచెట్టు రాగిచెట్టు కల్సి పెర్గినయి. దూరంనుండి చూస్తే ఒక్కచెట్టులాగే కన్పిస్తది. పదేండ్ల కింద ఓ సన్యాసి బాటన పోతూ, పటేలు ఇంటికాడ నీల్లు తాగి అటుకెల్లి చూసే వరకు కల్సి పెరిగిన రాగిచెట్టు, వేపచెట్టు ఒక్కచెట్టులాగే కన్పించింది. దగ్గరికి పోయి పరీక్షగా చూచి, ఇది మామూలుచెట్టు కాదు. దేవతా వృక్షం. పూజచేస్తే కల్సివస్తుందని చెప్పిండు. పటేలు ఆ విషయం అంతగా పట్టించుకోలేదు. ఇప్పుడు ముసలోడయ్యిండు. పనిపాట లేక అదో ఇదో ఆలోచించుకుంటూ వుంటే ఆ చెట్టు కన్పడ్డది. వెంటనే సన్యాసి చెప్పినమాట జ్ఞాపకం వచ్చింది. ఈ భూమికి ధర పల్కాలంటే ఏదో ఒకటి చేయాలని దాసరి రామచంద్రాన్ని పిల్చి–

"అరేయ్, రాత్రి నాకో కలొచ్చిందిరా. కలలో మైసమ్మతల్లి కన్పడి, 'ఇంకెన్నాల్లు నాకు గుడి కట్టించకుండా వుంటావురా' అని కోప్పడ్డదిరా"

'అట్లనా పటేలా'

'అటుచూడు, రాగిచెట్టు, వేపచెట్టు కల్సి ఎట్ల పెరిగినయో, పదేండ్లకింద ఓ సన్నాసి అది దేవతలచెట్టని చెప్పిండురా. కాని నేనే పనులల్లబడి పట్టించుకోలేదు. ఇన్నాల్లకు ఆ తల్లే యాదిచేసింది చూడు. వచ్చేది శివరాత్రి పండుగ కదా. ఆ పండుగెల్లినంక అమ్మవారిని కొల్వుదీర్చుదాం. యాటను బలిచ్చి పండుగ చేద్దాం'

'మంచిది పటేలా. ఆపని నాకొదులురి' అని దాసరి రామచంద్రం సారకొట్టుకాడ ఈ విషయం పదిమందికి చెప్పిండు. అనుకున్నట్టే శివరాత్రి పండుగెల్లినంక ఆచెట్టుకింద మూడురాల్లుబెట్టి పసుపుకుంకుమ రాసి మైసమ్మతల్లిని కొల్వుదీర్చింద్రు.

దాసరి పూలమ్మకు దేవతబూని శిగంవచ్చింది. వేపాకు మండలు చేతికి అందియ్యగానే వూగిపోతూ –

'అరేయ్! నేను ఇన్నాల్లకు గుర్తొచ్చినానురా. నన్నేమనుకుంద్రురా! నేను మైసమ్మతల్లిని. నన్ను కొల్చినోల్లకు మేలైతది' అంటూ వూగిపోబట్టింది. జనం బిందెలల్ల నీల్లు తెచ్చి నెత్తినబోసి–

'అట్లనే తల్లి. అందుకే నిన్ను కొల్వుదీర్చినం. తప్పులుంటే కాయి తల్లీ!' అంటూ అందరు దండాలు పెట్టింద్రు.

'నెలరోజుల్లో మీ బతుకులు మార్తయి చూడ్రా. నా మహిమేదో చూపిస్తా' అంటూ వూగి వూగి కూలబడింది.

'ఏందే పూలి, అట్ల పూనకం వచ్చిందేందే' అంటే–

'నాకేది యాదిలేదు' అంటూ ఏమి జర్గనట్లే ఉండిపోయింది. దీనితో ఇది మైసమ్మతల్లి మాటలేనని కూడిన జనం నమ్మింద్రు.

యాటపోతును బలి ఇచ్చింద్రు. చుట్టుపక్కల గుడిసెలోల్లు, దాసరోల్లు తలా ఒక కోడిని బలి ఇచ్చి కాల్లను చెట్టుకు వేల్లాడగట్టింద్రు. ఆడపిల్లలొచ్చి చెట్టు ముంగిట రంగురంగుల

ముగ్గులేసింద్రు. ఆ రాత్రంతా బైండ్లోల్లు జమిడిక వాయించుకుంటూ మైసమ్మ కథ చెప్పింద్రు. రోడ్డుమీద కొత్తగ వడ్ల మిల్లు పెట్టిన గజ్జిపుల్లయ్య, కోతమిషను పెట్టిన విఠలాచారి వచ్చి పడిపడి దండాలు పెట్టింద్రు. చుట్టుపక్కల వూర్లల్ల మైసమ్మతల్లి వెలసిందని బాగా ప్రచారం జర్గింది.

వారం వారం పండుగ కాజొచ్చింది. దాసరి రామచంద్రం కొడ్కులే పూజార్లయ్యింద్రు. వచ్చిన భక్తులందరు మొక్కులు మొక్కి చెట్టుకు ముడుపులు కట్టబట్టింద్రు. వారానికి వారానికి జనం ఎక్కువయ్యి సిగాలు వూగడం మామూలయ్యింది. పిల్లలు లేనోల్లు పానసరం పడ్తుంద్రు. ఏడువారాల పాటు వచ్చి మొక్కితే అనుకున్నయన్ని జర్గిపోతయని ప్రచారమయ్యింది.

యాడాది తిర్గేవరకు మొక్కుకున్నోల్లందరికి పిల్లలయ్యింద్రు. వ్యాపారస్తులకు కల్సిరా బట్టింది. గజ్జిపుల్లయ్య మిల్లు పెద్దగ జేసిండు. విఠలాచారి వ్యాపారం బాగా పుంజుకుంది.

ఆదివారం వచ్చిందంటే చాలు తెల్లారెవరకు దుకాణాలు వెలుస్తున్నయి. తీరొక్క ఆటబొమ్మలు, చిరుతిండ్లు, బొంగులు, పుట్నాలు, చిలుకలు, బత్తీసాలు, ప్లాస్టిక్ సామాన్లు, చిన్నపిల్లల బట్టలు, కండువలు, లుంగీలు, స్టీలుసామాన్లు ఒకటేమిటి, కాస్త దూరంగా కల్లుదుకాణం, చాటు మాటుగా సారాకొట్టు ఆ జాతరకొచ్చినోల్లు ఏదో ఒకటి కొనుక్కుంటుంటరు.

ఈ దెబ్బదో పటేలు భూమి దుకాణాలకు అమ్ముడుపోయింది. అనుకున్నది సాధించిండు.

ప్రతి ఆదివారం కోరికలు తీరినోల్లు మొక్కులు చెల్లించుకోడానికి ట్రాక్టరు మీద చుట్టపక్కాలతో వచ్చి యాటపోతును బలి ఇచ్చి వండుకుని తిని, తాగి పొద్దూక పోబట్టింద్రు. ఆదివారం వచ్చిందంటే ఆ వూరు వూరంతా పండుగలాగుంటది.

రెండు మూడేండ్లలో ఈ మైసమ్మ మహిమలు చుట్టపక్క జిల్లాలకు పాకింది. జనం జాతర కట్టింద్రు. దానితో జనం ఎక్కువ వస్తుంద్రని బేస్తవారం కూడా జాతర సాగబట్టింది.

✿ ✿ ✿

దాసరి రామచంద్రం ముసలోడయ్యిండు. చాతగాకుంటయ్యింది. తన తండ్రి, తాతలు కూడా ఎనబై ఏండ్లదాక బతికింద్రు. తను పట్నం కొట్టు పోయినప్పుడు పుట్టిన్నని వాల్లయ్యనంగ విన్నడు. రజాకార్లప్పుడు మాంచి పడుచోడు. నాటకాలు బాగా ఆడుతుండేది. ఈ మధ్య తను ఎంతోకాలం బతకనేమోనని అనిపిస్తుంది. ఈ నొప్పులతో రోగాలతో బతికేకన్నా పోవటమే మేలనిపిస్తుంది. అందుకే తనకు తెలిసిన విషయాలు పిల్లగాల్లకు చెప్పాలనిపిస్తుంది.

ఆ రోజు జాతర అయిపోయినంక రామచంద్రం కొడ్కులందరు సారతెచ్చుకుని తాగబట్టింద్రు. తండ్రినిపిలిచి సార వంచింద్రు. సార మింగేవరకు ముసలోనికి ఎక్కడలేని హుషారొచ్చింది. దానితో–

'అరె కొడ్కుల్లారా, నేను ఎక్కడ పుట్టిన్నో, ఎక్కడ పెర్గిన్నో యాదిలేదు నాయనా. మా అయ్య, పెద్దయ్యలు, చిన్నయ్యలు భాగోతులు ఆడుకుంట వూరూరు తిర్గుకుంట ఆఖరికి రావులపెంట చేరింద్రు. చిన్ననాటినుండి నాటకాలు ఆడుతుండేది. మొదట మీ అమ్మను



చేసుకున్న. అది మా మేనమామ బిడ్డేనాయె. అప్పట్లో నేను గజ్జెకట్టి రాజేషం కడ్తె వూరి ఆడపిల్లలు వెంటబడేదిరా. వాల్లను తట్టుకోలేకుంటి. ఆఖరికి మీ చిన్నమ్మ మాణిక్యం నా వెంటబడి వచ్చింది.'

'ఎట్లన్న మేము వింటున్నమని హెచ్చులు చెప్తున్నవు పట్టు'

'అరె పిచ్చిముండాకొడ్క. నేను రాజేషం కడ్తె వెలిగిపోతుండేది. నా మాట అబద్ధమైతే మీ చిన్నమ్మను అడగరాదురా?'

'సరె, అది పోనియ్యి. గింత భూమన్న సంపాదించలేదేందే'

'అప్పట్లో పూటకెల్లేదే కష్టంగుండేది. ఎప్పుడు తిండి దెవులాటేనాయె. భూములేడ సంపా దించకపోయిన. అయినా భూములున్నా సొంతిల్లున్నా ఎన్ని కష్టాలురా. ఎక్కడికి పోయినా పానం భూమిమీద, ఇంటిమీదనే గుంజుద్ది. ఆ రెండు లేవనుకో ఇక దెవులాటేముంది. అందుకే వాటిజోలికి పోలేదురా'

'సంపాదించ చేతగాక ఈ పనికిమాలిన మాటలు చెప్తున్నావ్'

'కాదు బిడ్డా, ఉన్నమాటే చెప్తున్న. మనది శివుని సంతతిరా. అడక్కతినే జాతి. ఆ ఆదిదేవుడు మనలను ఇట్లనే బతకమన్నడు. అందుకే ఆ తండ్రి ఆడించినట్లు, నాటకాలు ఆడుతున్నం'

'సరే పోనియ్యి. ఇంతకాలానికి ఈ మైసమ్మతల్లి చేతబట్టి నిమ్మలంగ బతుకుతున్నం, దేవులాట లేకుంటయ్యింది.'

'నేను చెప్తుతున్నదదేరా. అన్ని ఆ పరమాత్ముడే చూసుకుంటడు. మైసమ్మంటె ఎవరను కున్నరురా. ఆదిపరాశక్తి. ఆయమ్మ సాక్షాత్తు పార్వతీదేవి రూపం. అందుకే మనకు దారి చూపింది. ఇంకేమన్న వున్నాదిరా'

'అరె చిన్నోడా చూస్తవేందిరా, వంచు'

'చాలు చాలురా. ఈ రోజు సార మంచిగుందిరా'

'అయ్యా మనం మైసమ్మకాడ భక్తులు పెట్టిన కట్నకానుకలు, ముడుపులు తింటున్నం కదా, పాపం తల్గదానె'

'అరె తిక్కనాకొడ్క, ఏది పాపం, ఏది పుణ్యం. మనం పాపమనుకుంటె అది పాపమైతది. పుణ్యమనుకుంటె పుణ్యమైతది. అదంతే. ఇక్కడికొచ్చినోల్లంతా ఎందుకొస్తుంద్రనుకుంటవ్. మేము పాపాలు చేస్తున్నం. వాటిని పోగొట్టు తల్లీ అంటూ మొక్కుకుంటూ కట్నాలు, కానుకలు ముడుపులు కట్టి పోతంద్రు గదా. మనమేమో ఆ తల్లిని నిలబెట్టినోల్లం. సేవలు చేస్తుంటిమి. తల్లిసొమ్ము బిడ్డలకు కాక ఇంకెవరికి చెందుద్ది. అది మన హక్కు. శివుడు విషాన్ని మింగి హరించుకున్నట్లు మనం ఆ ముడుపుల సొమ్ము తిని అరిగించుకుంటున్నంరా'.

'బాగుందే, మంచిమాట చెప్పినవ్. అరే ఇంకో పావొంచరా'

'వద్దులేరా'

'కొద్దిగనే ఉంది తాగు. అయ్యా నీ కోరికలన్నీ తీరినాయె'

'ఓ చిన్నకోరిక మిగిలింది కొడ్కా'

'ఏందది?'

'మా తాతలు, తండ్రులు నాటకాలాడుకుంటనే చచ్చిపోయింద్రురా. మా తాత చావు కొద్దిగా యాదికుందిగాని, మా అయ్య చచ్చిపోయె ముందు హరిశ్చంద్ర నాటకం ఆడిపోయిండురా. అప్పట్లో పొట్లపాడు, అన్నారం దొరలు ముసలోని చివరినాటకం అని, నాటకం అయిపోంగనే బట్టబాత పెట్టింద్రురా. అప్పటికి వానికి ఒక్క పన్నూడలే. గొంతు జీరపోలే. ఇప్పుడు నేనెట్లున్ననో అట్లనే వుండనుకోరాదు. చచ్చి ఏలోకంలుండో పుణ్యాత్ముడు'.

'అయితే నువ్విప్పు డేమంటవే'

'నా వయసు కూడా అయిపోవచ్చిందిరా. వేషం కట్టక ముప్పై ఏండ్లపైనే అయ్యింది. అయినా దర్వులన్ని నోటికున్నయి. నాకు నాటకమేసి చచ్చిపోవాలని ఉందిరా'

'ఇప్పుడు దర్వులొచ్చినోనివి నువ్వొక్కడివే కన్పడుతున్నవ్. నీతోటోల్లందరూ పోయిరి. పెద్దన్న, చిన్నన్న చిన్నతనాన ఎప్పుడో వేషాలేసిరాయె. వాళ్లిప్పుడన్నీ మర్చిపోయె ఉంటరు. నీవొక్కనితోటి నాటకం వేయటం అయ్యేపనేనా?'

'పోయిన ఆదివారం నాడు జాతరలో దాసరి రాములుగాడు ఆలగడప నుండొచ్చిండురా. మా మేనమామ కొడ్కులు బుచ్చిరాములు, దాసరి యల్లయ్య, అట్లనే మన పాలోల్లు పెంటడు, కొండిగాడు, ఇస్తారిగాడు అందరూ అక్కడే వుంద్రంట. కూలినాలి చేసుకుంట బతుకుతుంద్రంట. వాల్లందరూ వేషాలేసినోల్లేనాయె. నేను రమ్మన్నని చెబితే తప్పకుండొస్తరు. నేనంటే వాల్లకు ప్రాణంరా'

'అయితే నేను రేపు పోయివస్తలేవె. మరి నాటకం వేయాలంటే కొంత ఖర్చయితది గదా'

'దాందేముందిరా, నేను గజ్జి పుల్లయ్యసేటును, విఠలాచారిని మన పటేలును అడ్గిత నా మాట కాదనరు. పైనున్న బుట్టలో కిరీటాలు, భుజకీర్తులు అట్లనే యాగయ్య రాసిన హరిశ్చంద్ర నాటకం వుండాలె చూడరా పెద్దోడ'

రామచంద్రం చిన్నకొడ్కు ఆలగడకు పోయి ఆ నల్గురిని వెంటబెట్టుకొచ్చిండు. వచ్చిన్నాడు అందరూ కల్సి తిని తాగి వెన్కటి ముచ్చట్లు కలబోసుకుంద్రు. ముసలోడు నాటకం గూర్చి చెప్పిండు. చెదలు పట్టిన హరిశ్చంద్ర నాటకం దొరికింది. చిన్నగ ఒక్కొక్క దర్వు గునుక్కుంటు, మినుక్కుంటు నోటబట్టించుకుంద్రు. మద్దెల ఆర్మోణి బాగుచేసింద్రు. తాళాలు వెతకంగ వెతకంగ దొర్కినయి. రామచంద్రం హరిశ్చంద్రుడుగా, కొండిగాడు చంద్రమతిగా, విశ్వామిత్రుడుగా పెంటడు, నక్షత్రకుడిగా బుచ్చిరాములు వాల్ల వాల్ల దర్వులు నాల్గయిదు రోజులపాటు ఒకరేత్రిదాక పాడి నోటబట్టించుకుంద్రు.

లోహితాస్యుడుగా రామచంద్రం మనుమడు కుదిరిండు. కేతిగాడు, బంగారక్కగా రామచంద్రం పెద్దకొడుకు కుంటి ముత్తడు మోటుసరసం మాటలు నోటబట్టించు కుంద్రు.



శివరాత్రి రానే వచ్చింది. అనుకున్నట్టుగా గజ్జి పుల్లయ్యసేటు, విఠలాచారి , పటేలు దబ్బులిచ్చింద్రు.

రాత్రి పదిగంటలకు నాటకం మొదలయ్యింది. తలా ఓ పావు సారా పట్టించి బల్లెపీట ఎక్కింద్రు. బాలకృష్ణుని వేషం వచ్చి ఎగిరి ఎగిరి పోయింది. హరిశ్చంద్ర మారాజు వేషం వచ్చింది. రామచంద్రం కిరీటం, భుజకీర్తులతో వెల్గిపోతుండు. 'రాజు వెడలె సభకు' అంటూ దర్వు వేస్తూ పాట మొదలుపెట్టిండు. పక్కనున్నోల్లు వంతలు అందుకుంద్రు. పెద్దభార్య ముత్తి కూడా ఓ పావు సారా మింగి తాళాలు కొడ్తూ వంత అందుకుంది. ఒక్కొక్క వేషం రాబట్టింది. జనం చాపచింపులు, బస్తాచింపులు వేసుకుని కూర్చుంద్రు. అసలు నాటకానికన్నా కేతిగాన్ని, బంగారక్కను చూడడమే జనానికి బాగా నచ్చింది. వాల్ల మోటు సరసానికి జనం విరగబడి నవ్వుతుంద్రు. వీటికి తోడు నక్షత్రకుని హాస్యం కూడా బాగా పండింది. అఖరికి కాటిసీను వచ్చే వరకు అమ్మలక్కలు కంటనీరు బెట్టుకుంటూ, ముక్కులు చీదబట్టింద్రు. కోడికూసే వరకు నాటకం అయిపోయింది. వేషాలేసినోల్లందరు హారతిపట్టుకుని జనంలోకి పోతే తలా ఓ రూపాయి అందులో వేసింద్రు. అట్లే పటేలు ఇంటికి పోతే ఓ యాటపోతును ఇనాం చెప్పిండు. పుల్లయ్యసేటు, విఠలాచారి రామచంద్రానికి కొత్తబట్టలు పెట్టింద్రు.

తెల్లారి యాటపోతును మైసమ్మకాడ బలి ఇచ్చి దాసరోల్లంతా పండుగ జేసుకుంద్రు. ఆ పండుగ రెండు రోజులపాటు జర్గింది. హారతి పళ్ళెంల వచ్చిన దబ్బంతా సారకే పెట్టింద్రు. ఆలగడప నుండొచ్చినోల్లు పోతామనడం లేదు. ఆడిన నాటకం గూర్చే రెండురోజుల నుండి మాట్లాడుకుంద్రు.

మూడోరోజు రాత్రి అందరూ కల్సి తాగుతుంద్రు. రామచంద్రం బాగా అలసిపోయిండు. తాగి వూరుకోకుండా గడిచిపోయిన సంగతులు చెప్తుండు.

పెద్దకొడ్కు వచ్చి 'అయ్యా ఇంకొంచెం తీసుకుంటావె'

'అట్లనా, సరే కానియ్యి' అంటూ అందించిన సారా మింగిండు. వెంటనే మంచంమీద వరిగిండు.

తెల్లారింది. పొద్దెక్కింది. ముసులోడు ఇంకా లేవలేదేందిరా అని అటు ఇటు కదిపితే, ఎటు వరిగినోడు అటే వరిగిపోతుండు.

ఆటన్నా, పాటన్నా!

అంతా బొమ్మలాటన్నా!

ఆడి పాడి, అలసి సొలసి

అవని వీడి పోయాడన్నా!!

❀

(సోపతి నవతెలంగాణ ఆదివారం అనుబంధం 2015 లో ప్రచురితం)